క్లుప్తంగా

కోలాహలంగా లయన్స్ క్లబ్ ఎన్నికలు



నూతనంగా ఎన్నికైన సభ్యులు

సీటీఆర్ఐ: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 316 బి ఎన్నికలు ఆదివారం రాత్రి స్థానిక శుభ మస్తు ఫంక్షన్ హాల్లో జరిగాయి. క్లబ్ జిల్లా గవర్నర్ మాటూరి మంగతాయారు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారిగా లయన్ బాదం బాలకృష్ణ వ్యవహరించారు. 2023 – 24 సంవత్సరానికి జిల్లా గవర్నర్‌గా లయన్ వేలూరి సూర్యనారాయణ, ఒకటో జిల్లా ఉప గవర్నర్‌గా ఈవీవీ ఈశ్వర కుమారి, 2వ జిల్లా ఉప గవర్నర్‌గా వజ్రపు కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బీవీఎస్ రెడ్డి, విజయ కుమార్ రాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సత్యసాయి ఆరాధన మహోత్సవాలు

రాజమహేంద్రవరం రూరల్: సత్యసాయిబాబా ఆరాధన మహోత్సవాలను రాజమహేంద్రవరం నగరం, గ్రామీణ మండలాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆల్కాట్ గార్డెన్స్‌లోని సత్యసాయి గురుకులంలో నిర్వహించిన కార్యక్రమంలో కరస్పాండెంట్ ఏ.శ్యాంసుందర్, కె.గుర్రయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సత్యసాయి సేవాసంస్థల ఆధ్వర్యంలో ఐఎల్‌టీడీ ఫ్లైఓవర్, ఐదుబళ్ల మార్కెట్, ఏవీఅప్పారావు రోడ్డు, ఇన్నీస్‌పేట, హెచ్‌బీ కాలనీ, కొంతమూరు, సాయినగర్ ప్రాంతాల్లో బాటసారులకు ఆహారం, మజ్జిగ, వస్త్రాలను అందించినట్లు సేవాసంస్థల ప్రతినిధి త్రిమూర్తులు తెలిపారు.

వాటర్ ఫిల్టర్ వితరణ



వాటర్ ఫిల్టర్ అందజేస్తున్న రత్నకుమారి

కంబాలచెరువు: స్థానిక బీజీఆర్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయులు టి.నళిని రత్నకుమారి కోటగుమ్మం వద్దగల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ కార్యాలయానికి దాదాపు రూ.15 వేలు విలువైన వాటర్ ఫిల్టర్‌ను బహూకరించారు. ఈ మేరకు సోమవారం అర్బన్ రేంజ్ డీఐ దిలీప్ కుమార్‌కు అందజేశారు.

విశాఖ స్టీల్‌పై కేంద్ర ప్రభుత్వం డ్రామా



కేఏ పాల్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో కేంద్రప్రభుత్వం డ్రామాలాడుతుందని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఏ పాల్ ఆరోపించారు. రాజమహేంద్రవరంలో సోమవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అంబానీ, అదానీలకు కారుచౌకగా కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తుందన్నారు. ఐపీఎస్ విశ్రాంత అధికారి లక్ష్మీనారాయణ ప్రజాశాంతి పార్టీలో చేరితే కీలక బాధ్యతలు అప్పగిస్తానన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

రంగంపేట: రంగంపేటలోని సాయినగర్‌లో కొలువైన వీరభద్రస్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ మే 1వ తేదీ వరకూ ఉత్సవాలు జరుగుతాయని, అదే రోజున ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు ఉదయం స్వామివారి చిత్రపటాన్ని సప్తరథంపై ఊరేగించారు. కార్యక్రమంలో యానాపు త్రిమూర్తులు, బొట్టు స్వామి, కేతా సత్తిబాబు, మద్దిపాటి సాయి సుధీర్, కొండి జమీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో డొల్లతనం

సీటీఆర్ఐ: నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో డొల్లతనం స్పష్టంగా బయట పడుతోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆరోపించారు. ఫలితంగా కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని విమర్శించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్‌కు ప్రజలు కట్టిన పన్నుల ద్వారా వచ్చిన సొమ్మునే అభివృద్ధి పేరుతో పనులకు వెచ్చిస్తున్నారన్నారు.

రాష్ట్రంలో సుపరిపాలన

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని గృహసారథి మద్దాల కొండలరావు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో సోమవారం సీతానగరంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. బుక్‌లెట్‌లో ఉన్న ప్రశ్నలకు జవాబులు రాబట్టి, మిస్డ్ కాల్ చేశారు. అనంతరం ఇంటి వద్ద, సెల్ ఫోన్లకు మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లు అతికించారు. తవిటికి డేవిడ్ రాజ్, వలంటీర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యరంగానికి స్వర్ణయుగం

- మంత్రి విడదల రజిని
- ప్రభుత్వాస్పత్రిలో సౌకర్యాలపై ఆరా



రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో రోగులను పరామర్శిస్తున్న మంత్రి రజిని



జ్యోతిరావుపూలే విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న మంత్రులు రజిని, వేణు, ఎంపీ భరత్‌రామ్

కంబాలచెరువు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వైద్యరంగానికి స్వర్ణయుగం వచ్చిందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆమె సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగుల వద్దకు వెళ్లి వైద్యసేవలపై ఆరాతీశారు. డాక్టర్లు వైద్యం బాగా చేస్తున్నారా, నర్సులు మంచిగా చూసుకుంటున్నారా, డబ్బులు ఏమైనా తీసుకున్నారా అని ప్రశ్నించారు. అక్కడ నుంచి ఆసుపత్రి వెనుకవైపు ఉన్న హెచ్ఐవీ బ్లాకుకు వెళ్లారు. అక్కడ బాధితులను ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రి సమీపంలో జరుగుతున్న వైద్య కళాశాల పనులను పర్యవేక్షించారు. ఆమె వెంట కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, ఎంపీ భరత్ రామ్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, వైద్య, ఆరోగ్యశాఖ కమిషనర్ మురళీధరరెడ్డి, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, రూరల్ కోఆర్డినేటర్ చందన రమేష్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు ఉన్నారు.

పూలే, అంబేడ్కర్ వారసుడు జగన్

సీటీఆర్ఐ: బీసీల కులగణనకు కమిటీ వేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి.. మహాత్మా జ్యోతిరావు పూలే, అంబేడ్కర్‌కు నిజమైన వారసుడు అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, బీసీ సంక్షేమ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస గోపాలకృష్ణ అన్నారు. సోమవారం రాజమహేంద్రవరంలోని గోదావరి గట్టున రూ.8.25 కోట్లతో నిర్మించే పూలే, అంబేడ్కర్ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల అభివృద్ధి, సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్న వ్యక్తి జగన్ అన్నారు.

బీసీల అభ్యున్నతికి కృషి

బీసీల అభ్యున్నతి, సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషిచేస్తున్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. సోమవారం గోదావరి గట్టుపై ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహం సెంటర్ వద్ద రూ.8.25 కోట్లతో నిర్మించబోయే భవన నిర్మాణ శంకుస్థాపనలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ దేశంలో వెనుకబడిన వర్గాల వారికి పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్న రాష్ట్రం మనదేనన్నారు. రాజమహేంద్రవరంలో పూలే, అంబేడ్కర్ భవన నిర్మాణం చేపట్టాలన్న ఎంపీ భరత్‌రామ్ నిర్ణయం అభినందనీయమన్నారు. ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ సమసమాజ స్థాపనకు పూలే, అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయమన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం పూలే, అంబేడ్కర్ ఎన్నో ఉద్యమాలు చేశారని, వారిని ఆదర్శంగా తీసుకోవడం మన కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రీనరీఅండ్‌బ్యూటిఫికేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్, కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, మార్గాని నాగేశ్వరరావు, నయనాల కృష్ణారావు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం



స్పందనలో అర్జీదారులతో మాట్లాడుతున్న కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: స్పందన కార్యక్రమానికి వస్తున్న అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్టు నగర పాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో ప్రజల నుంచి 18 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మరింత మెరుగైన పౌరసేవలు అందించే క్రమంలో ప్రజల నుంచి వచ్చే సూచనలను పరిగణనలోకి తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు డిప్యూటీ కమిషనర్ పీఎం సత్యవేణి, ముఖ్య పట్టణ ప్లానింగ్ అధికారి జె.సూరజ్ కుమార్, సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం



పారిశుధ్య సిబ్బందిని సన్మానిస్తున్న సచివాలయ కన్వీనర్లు

ధవళేశ్వరం: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ధవళేశ్వరం పారిశుధ్య సిబ్బందిని సోమవారం సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి డి.సూరిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సచివాలయ కన్వీనర్లు మెండా రాజేష్, తలారి వరప్రసాద్, పేర్ల దుర్గాప్రసాద్, హమీద్ బాషా, వైఎస్సార్ సీపీ నాయకులు పెన్నాడ జయప్రసాద్, బొడ్డేటి శివాజీ, బోడపాటి కుమార్, గొన్నా సత్తిబాబు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు.

డ్రైనేజీలో పడి వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం రూరల్: ప్రమాదవశాత్తు డ్రైనేజీలో పడి హుకుంపేట గ్రామానికి చెందిన పోలిశెట్టి నాగేశ్వరరావు (58) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... పోలిశెట్టి నాగేశ్వరరావు హుకుంపేట సరస్వతి స్కూల్ సమీపంలో ఉంటాడు. ప్రతిరోజు సైకిల్‌పై ఆవరోడ్‌లో వడ్రంగి పనికి వెళ్తుంటాడు. ఆదివారం రాత్రి ఇంటికి రాకపోవడంతో యజమానికి కుటుంబ సభ్యులు ఫోన్‌చేయగా రాత్రి 8.30 గంటలకే సైకిల్‌పై బయలుదేరినట్లు తెలిపారు. సోమవారం ఉదయం నాగేశ్వరరావు సైకిల్‌పై వెళ్లే మార్గంలో వెతకగా 100 అడుగుల రోడ్డు పక్కన డ్రైనేజీలో పడి మృతి చెందాడు. పోలిశెట్టి వెంకట దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఆర్.శివాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గుర్తుతెలియని వ్యక్తి మృతి

కంబాలచెరువు: స్థానిక తిలక్ రోడ్డు శ్రీషిర్డీసాయి మార్గ్‌లోని డ్రైనేజీలో పడి గుర్తుతెలియని వ్యక్తి (55) అనుమానాస్పదస్థితితో మృతి చెందాడు. సోమవారం రాత్రి ఈ ఘటన జరిగింది. తిలక్ రోడ్డులో కొద్దికాలంగా డ్రైనేజీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆ ప్రాంతం మీదుగా వెళుతున్న వ్యక్తి ప్రమాదవశాత్తు డ్రైనేజీలో పడిపోయి మృతి చెందాడు. కాగా.. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుడు ఆదిరెడ్డి వాసు ఆ ప్రాంతానికి చేరుకుని డ్రైనేజీ నిర్మాణ పనులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ధర్నా చేశారు. పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని జరిగిన సంఘటపై ఆరా తీశారు. ధర్నా చేస్తున్న ఆదిరెడ్డి వాసును అరెస్టు చేశారు.

కానేడులో రెండు బైక్‌ల ఢీ

బిక్కవోలు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైనట్లు ఎస్ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం ద్విచక్రవాహనంపై వెళుతున్న రంగాపురానికి చెందిన అనసూరి సూర్యచంద్రరావు అనే వ్యక్తిని బలభద్రపురం గ్రామ శివారుల్లో కానేడు పెట్రోలు బంకు వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయాలపాలైన సూర్యచంద్రరావును 108లో అనపర్తి సీహెచ్‌సీ తీసుకెళ్లి ప్రథమ చికిత్స అనంతరం కాకినాడ తరలించినట్లుగా ఆయన తెలిపారు.

సినిమాలు



రాజమహేంద్రవరం

శ్యామల	: శాకుంతలం
సూర్యమినీ	: ఈవెల్‌డెడ్ రైస్
సూర్యప్యాలెస్	: విరూపాక్ష
స్వామి	: విరూపాక్ష
అశోక	: దసరా
శివజ్యోతి	: విడుదల
రాజా	: విరూపాక్ష
ఊర్వశి	: కిసికిబాయ్ కిసికిజాన్
రంభ	: రుద్రుడు
మేనక	: రావణాసుర
నామవరం	
వీఎస్ మహల్	: దసరా
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: కిసికిబాయ్ కిసికిజాన్
కడియం	
వెంకటసూర్య	: విరూపాక్ష

సిటీ ఆటో.. పర్యవేక్షణ ఎటో..

- నిబంధనలు పాటించని కొందరు డ్రైవర్లు
- ఆటోవాలాల ముసుగులో ఆకతాయిలు



కంబాలచెరువు: నగరంలోని ప్రధాన ప్రయాణ సాధనాల్లో ఆటోది ప్రథమ స్థానం. మన నివాసాల ఎంపికలో బస్సు, రైల్వేస్టేషన్లు దగ్గర లేకపోయినా ఆటోసర్వీసు అందుబాటులో ఉందా అని ఆరా తీస్తుంటాం. ఇలా దైనందిన జీవితంలో ఆటోతో ఎక్కువ మంది జీవనం ముడిపడి ఉంది. విస్తరిస్తున్న నగరానికి అనుగుణంగా ఆటోలు పెరుతున్నాయి. నిరుద్యోగ యువతకు సులువైన ఉపాధి మార్గం కావడంతో ఆటో డ్రైవర్లుగా తమ వృత్తిని ఎంచుకుంటున్న వారు రోజురోజుకూ పెరుగుతున్నారు.

జన జీవనంలో ఇంత ముఖ్యభూమిక పోషిస్తున్న ఆటో సర్వీసు విధానంపై సరైన పర్యవేక్షణ, నియంత్రణ లేకపోవడంతో ఇటీవల ఆకతాయిలు, నేరస్తులు ఈ రంగంలో ప్రవేశించి ఆటో రంగానికి మచ్చతెస్తున్నారు.

గతంలో కట్టుదిట్టం..

గతంలో నగరంలో తిరిగే ప్రతి ఆటోకు ట్రాఫిక్ పోలీసులు ఒక యూనిక్ కోడ్ నంబరు కేటాయించారు. దాని ద్వారా ఆటో యజమాని, దాని డ్రైవరు వివరాలు పోలీసుల వద్ద ఉండేవి. ప్రతి ఆటోలో డ్రైవరు సీటు వెనుక డ్రైవరు ఫొటో, వివరాలను ప్రయాణికుడికి తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయించారు. అయితే ప్రస్తుతం పర్యవేక్షణ లేకపోవడంతో ఆ నిబంధనలు అటకెక్కాయి. చాలామంది ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటిస్తున్నా.. కొత్తగా ఈ రంగంలో ప్రవేశించే కొందరు వాటిని పట్టించుకోవడం లేదు. నగరంలో ఎన్ని ఆటోలు తిరుగుతున్నాయి, వాటి డ్రైవర్లు ఎవరు, అద్దె ఆటోలు ఎన్ని తదితర వివరాలు పోలీసుల వద్ద పూర్తిగా లేవు. దీంతో పాత వివరాలతోనే నెట్టుకొస్తున్నారు.

ఆటో డ్రైవర్ల ముసుగులో..

ఆటోలకు ప్రజల ఆదరణ ఎక్కువగా ఉండటం, సులువుగా ఉపాధి దొరకుతుండటంతో నిరుద్యోగ యువత ఎక్కువగా ఈ రంగాన్ని ఎంచుకుంటున్నారు. అయితే కొందరు నేరస్తులు ఇదే అదునుగా ఆటో డ్రైవర్ల ముసుగులో నేరాలకు పాల్పడుతున్నారు. ఆటో ఎక్కిన యువతులను వేధించిన ఘటనలపై ఫిర్యాదులు అందిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా డ్రెస్ కోడ్ పాటించాలి. ఆటోలో లౌడ్ స్పీకర్లు, పెద్దశబ్దంతో పాటలు పెట్టకూడదు. డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉన్న వారికే ఆటోలను అద్దెకు ఇవ్వాలి. సాధ్యమైనంత వరకూ ఆటోస్టాండులో సభ్యత్వం ఉన్నవారి ఆటోల్లోనే ప్రయాణికులు ఎక్కేలా అవగాహన కల్పించాలి.

చరిత్రను పరిశీలించాలి



ఆటోలు అద్దెకిచ్చే యజమానులు వాటిని తీసుకెళ్లే వ్యక్తుల చరిత్రను పరిశీలించాలి. డబ్బులు వస్తాయని ఎవరికిబడితే వారికి ఆటో ఇవ్వవద్దు. ఎవరైనా ఆటోలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, యాక్సిడెంట్లు చేసినా ఆటో నడిపిన వ్యక్తితో పాటు అద్దెకు ఇచ్చిన యజమానిపై కూడా కేసు నమోదవుతుంది. ఆటోలకు గతంలో యునిక్ కోడ్ ఉండేది. ఇప్పుడు అది కష్టసాధ్యంగా మారింది. నగరంలో ఆటోస్టాండ్లు ఉండేవి. అవి స్థానికంగా తిరిగేవి. ఇప్పుడు మన జిల్లానే కాదు పక్క జిల్లాలను ఆటోలు వచ్చేస్తున్నాయి.

– కేవీఎస్ వరప్రసాద్, ట్రాఫిక్ డీఎస్పీ, రాజమహేంద్రవరం

రేపు తాడాల వీరాస్వామి విగ్రహావిష్కరణ



ప్రారంభానికి సిద్ధమైన వీరాస్వామి విగ్రహం

కడియం: నర్సరీ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, దివంగత తాడాల వీరాస్వామి (పెదకాపు) విగ్రహావిష్కరణ బుధవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీరాస్వామి కుమారులు రాజు, రవి, రఘు మాట్లాడారు. ఆవిష్కరణకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలువురు ప్రముఖులను ఆహ్వానించామన్నారు. కాగా.. కడియం ప్రాంత నర్సరీ రంగంతో పరిచయం ఉన్న వారందరికీ పెదకాపుగా చిరపరిచితుడైన తాడాల వీరాస్వామి కావిళ్లతో మొక్కలను మోసుకుని కడియం రైల్వే స్టేషన్‌కు తీసుకువెళ్లి, అక్కడ్నుంచి ఇతర రాష్ట్రాలకు పట్టుకు వెళ్లేవారు. అప్పటి తరం నుంచి ప్రస్తుతం ఆన్‌లైన్‌లో మొక్కల వ్యాపారం సాగించే ప్రస్తుత కొత్త తరం వరకు ఆయన వారధిగా ఉన్నారు. కన్నుమూసేంత వరకు నర్సరీ రంగ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేశారు. మాతృభాష తెలుగుతో పాటు మరో నాలుగు భాషలు మాట్లాడడం ఆయన ప్రత్యేకత. 23 ఏళ్ల పాటు కడియం నర్సరీల సంఘానికి ఏకగ్రీవ అధ్యక్షుడిగా సేవలందించారు. 1988లో 33 మంది పేదలకు జాతీయ రహదారి పక్కనే గల తన సొంత స్థలాన్ని ఇళ్ల స్థలాలుగా అందజేశారు. ప్రస్తుతం ఈ కాలనీ సమీపంలోనే వీరాస్వామి నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు.


7 నుంచి వేసవి శిక్షణ తరగతులు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చింతా ప్రసాదరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్ర కేసరి యువజన సమితి ఆధ్వర్యంలో మే 7 నుంచి జూన్ 4వ తేదీ వరకు స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో వేసవి సామాజిక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్షుడు పెదిరెడ్ల శ్రీనివాస్ తెలిపారు. శిక్షణకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ పూర్వపు అధ్యక్షుడు చింతా ప్రసాదరెడ్డి ఆవిష్కరించారు. సమితి పూర్వాధ్యక్షుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ కర్రి రామారెడ్డి పర్యవేక్షణలో అనేక సామాజిక, వ్యక్తిత్వ, విజ్ఞాన, ఆధునిక, విశేషాలకు సంబంధించి అనుభవజ్ఞులైన వారితో తరగతులు నిర్వహించనున్నట్లు కార్యక్రమ కన్వీనర్ మాదిరాజు శ్రీనివాసు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు జరుగుతాయని కోఆర్డినేటర్ దేశిరెడ్డి బలరామనాయుడు తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్ర కేసరి జూనియర్ కళాశాల సహాయ కార్యదర్శి దూర్వాసుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వెయిట్‌లిఫ్టర్ బాలకృష్ణకు అభినందనలు



బాలకృష్ణను అభినందిస్తున్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం రూరల్: వెయిట్‌లిఫ్టింగ్‌లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తూ, పతకాలు సాధిస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికుడు అర్జి బాలకృష్ణ యువతకు ఆదర్శనీయమని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. కలెక్టర్‌ను సోమవారం రాత్రి బాలకృష్ణ కలిసి, రాష్ట్రస్థాయి పోటీల్లో తాను గెలిచిన పతకాలను చూపించాడు. ఆయన మాట్లాడుతూ బొమ్మూరు నేతాజీనగర్‌లో డీవీవీ సత్యనారాయణ దగ్గర పవర్ లిఫ్టింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నానన్నారు. కేరళలో ఈనెల నాలుగు నుంచి ఆరోతేదీ వరకూ జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొని పలు పతకాలు సాధించానన్నాడు.

9 పంచాయతీలకు అవార్డులు

రాజానగరం: మండలంలోని 9 పంచాయతీలకు వివిధ కేటగిరీలలో ఉత్తమ అవార్డులు లభించాయి. జాతీయ పంచాయతీ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఈ అవార్డులను ఆయా పంచాయతీ కార్యదర్శులు డీఎల్‌పీఓ జె.సత్యనారాయణ, ఎంపీడీఓ బి.రామారావు నుంచి అందుకున్నారు. సుపరిపాలనలో రాజానగరం, నీటి సమృద్ధిలో నామవరం, స్వయం సమృద్ధితో మౌలిక సదుపాయాల కల్పనలో దివాన్ చెరువు, సామాజిక భద్రతలో భూపాలపట్నం, మెరుగైన జీవనోపాదులు అందించడంలో వెలుగుబంద, పచ్చదనం – పరిశుభ్రతలో ముక్కినాడ, మహిళ స్నేహపూర్వకతలో కొత్త తుంగపాడు, పిల్లల స్నేహపూర్వకతలో పాత తుంగపాడు, ఆరోగ్యంలో నరేంద్రపురం పంచాయతీలకు ఈ అవార్డులు వరించాయి. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ బొజ్జిరాజు, సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.